క్లుప్తంగా

నివాళి



కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయిబాబాచౌదరి సతీమణి రోజారాణి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబాను పరామర్శించారు.

సఫ్దార్‌నగర్ సమస్యలను పరిష్కరిస్తా

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో గురువారం కార్పొరేటర్ సబిహా బేగం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అమిత్, అబ్దుల్, అహ్మద్, సలీం, యోగిరాజు స్వామి, ఇస్మాయిల్, అస్మ బేగం తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో ఎక్కడ చూసినా సమస్యలే

బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రగతినగర్, హనుమాన్‌నగర్‌లలో పార్టీ రాష్ట్ర నేత రవికుమార్‌యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. అవినీతి బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అష్టకష్టలు పడుతున్నారని పేర్కొన్నారు. డబుల్ ఇళ్లు లబ్ధిదారులకు అందలేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పేరుతో దోచుకుతింటున్నారని విమర్శించారు. మరి కొద్ది రోజుల్లోనే ప్రజలకు మంచి రోజులు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్వతాలు యాదవ్, శ్రీహరి, నరేందర్‌రెడ్డి, గోవర్ధనాచారి, సాయికుమార్, విజయ్‌కుమార్, వెంకటేష్, శ్రీధర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అవంతినగర్ తాగునీటి సమస్యను పరిష్కరించండి



వాటర్‌వర్క్స్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

మోతీనగర్: అవంతినగర్ కాలనీఈస్ట్‌లో కొన్ని రోజుల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు సమస్యను పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ కార్యాలయంలోని అధికారికి వినతిపత్రం అందజేశారు. వేసవిలో సరిపడ నీరు రావడం లేదన్నారు. ప్రస్తుత జనాభా అవసరాలను గుర్తించి పెద్ద పైపులైన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్ కోటిరెడ్డి, చైర్మన్ బి.ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రావు, కోశాధికారి భిక్షపతి ముదిరాజ్ పాల్గొన్నారు.

ఇళ్ల మరమ్మతులకు అనుమతులు ఇప్పించండి

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌కు నడిగడ్డతండావాసుల వినతి



మియాపూర్: ఇటీవల కురిసిన వర్షానికి నడిగడ్డతండాలో పాడైన ఇళ్లకు మరమ్మతులు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో గత యాభై సంవత్సరాలుగా 800 కుటుంబాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని అయితే సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కాలనీలోకి ఎలాంటి ముడి సరుకులు ఇటుక,సిమెంట్ ఇతర వస్తువులను తీసుకురాకుండా ఇబ్బందులుపెడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయాయని వాటిని పునర్నిర్మాణం చేయనివ్వడం లేదని పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరమ్మతులకు అనుమతులు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బంజరా సేవా సంఘ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ్ నాయక్, తండా గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రత్నకుమార్, దేవనూరు లక్ష్మీ, క్రిష్ణ నాయక్, కల్యాణి భాయ్, జానకి తదితరులున్నారు.

ఇవీ మోతీనగర్‌లోని సమస్యలు

పట్టించుకుని పరిష్కరించాలని వినతులు



కాలనీ వీధుల్లో తిరుగుతున్న వీధి కుక్కలు



ఓ ఇంటి ప్రహరీ వద్ద చెత్తను తొలగించని దృశ్యం





వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



మోతీనగర్‌లో బస్సు షెల్టర్ లేక ఎండలో నిలబడిన ప్రయాణీకులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదనేది పైనున్న చిత్రాలను చూస్తే అర్థమవుతోంది. మోతీనగర్‌లోని ప్రధాన వీధుల్ల ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మట్టి కుప్పలతో కనిపిస్తున్నాయి. నరికిన చెట్ల కొమ్మలను సైతం రోడ్డు పక్కన పడేస్తుండటం గమనార్హం. వీధి కుక్కల బెడద పెరిగినా పట్టించుకోవడం లేదు. నిత్యం ఏదో ఒక వీధిలో తాగునీటి లీకేజీ ఏర్పడుతున్నా పరిష్కారం చూపని పరిస్థితి. అదే విధంగా మోతీనగర్ చౌరస్తాలో రోడ్డుకు ఇరువైపులా బస్సు షెల్టర్ లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. మోతీనగర్ అనగానే గతంలో అభివృద్ధిలో గానీ జనాభా పరంగా గానీ నగరంలో మొదటి ప్రాధాన్యత ఉండేది. కానీ నేడు సమస్యలతో మోతీనగర్ కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైన పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన రవాణా సౌకర్యానికి కృషి చేస్తా



సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్‌అమీర్, సప్తగిరి కాలనీల్లో 103.76 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు,డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఉద్యకారులపై కేసులను ఎత్తేస్తాం



ప్రజలతో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యకారులపై కేసులను ఎత్తివేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, దుర్గా ఎస్టేట్, బ్యాంక్ కాలనీ, ఎంఎన్‌రెడ్డి నగర్ ప్రాంతాల్లో ×హాథ్ సే హాథ్ జోడో×యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

◆ అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా పని చేసిన ఉద్యమకారులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టి ద్రోహులను అందలమెక్కించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు గౌరవ వేతనాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమర్, నాయకులు బేకు శ్రీనివాస్, సూదుల సంపత్‌గౌడ్, పుల్లెం రాజు, అవిజె జేమ్స్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, నార్సింగ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

నిజాంపేట్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. 14వ డివిజన్ సాయి బృందావన్ ఎస్టేట్స్‌లో శ్రీబాలాజీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి, డయగ్నోస్టిక్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరి, కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ రాము, డాక్టర్ బాలాజీ, డాక్టర్ నాగప్రియ, డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన పాస్టర్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్ పాస్టర్ అసోసియేషన్ సభ్యులు మేయర్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు స్టీఫెన్ పాల్, శౌరి, మోజెస్, చారి, యోష, జోసెఫ్, కుమార్, శేతు తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు

కాలనీవాసుల ఆగ్రహం



ప్రశాంతి గోల్డెన్‌హిల్స్ పార్కు వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ లైన్ నిర్మాణం

నిజాంపేట్: బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ముదిరాజ్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధి ప్రగతినగర్‌లోని ప్రశాంతి గోల్డెన్ హిల్స్ పార్కు నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధికి చెందిన భవనానికి ఎలాంటి అనుమతులు లేకుండా డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు చేపట్టడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం డ్రైనేజీ పనులను పరిశీలించి సతీష్ దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఓ ప్రజాప్రతినిదికి లబ్ధి చేకూర్చడం ఎంత వరకు సమంజసమని అన్నారు. దీనిపై అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'మనూ' దూరవిద్య పోర్టల్ పున:ప్రారంభం

- 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్

రాయదుర్గం: మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యావకాశాల కోసం పోర్టల్‌ను పున: ప్రారంభించినట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ గురువారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో పోస్టుగాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ ('సెమిస్టర్ మోడ్-2020 బ్యాచ్, సెమిస్టర్ మోడ్-2019 బ్యాచ్) ప్రోగ్రామ్‌ల యొక్క ఫాలోఅన్ కోర్సులలో నమోదు కోసం పోర్టల్‌ను తెరిచి ఉంచడం జరిగిందన్నారు. ఫీజు చెల్లింపు పోర్టల్ మే 21 వరకు ఉంటుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోసం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

ఇండియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ల ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శేరిలింగంపల్లి చందానగర్, యాప్రాల్ వంపుగూడల్లో ఇండియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌లను ప్రారంభించింది. ఈ రెండు నూతన శాఖలను ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేషరామన్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జోనల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్, ఉండియన్ బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.

భెల్‌లో మాక్‌డ్రిల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బాంబు నిర్వీర్యంపై బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ వద్ద గురువారం రాష్ట్ర బాంబు స్క్వాడ్, భెల్ సీఐఎస్‌ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రతపై సిఐఎస్‌ఎఫ్ అధికారులు అవగాహన కల్పించారు.

'రేడియేషన్' పట్ల జాగ్రత్త వహించాలి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ 'రేడియేషన్'పై జాగ్రత్తలు పాటించాలని అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ ఎస్ అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ విద్యార్థుల కోసం 'రేడియేషన్ అండ్ సేఫ్టీ మెజర్స్' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వివిధ రకాల రేడియేషన్‌లతో వారి రోజువారీ జీవితంలో ఎలా జాగ్రత్తగా ఉండాలో ఆయన వివరించారు. అమెరికాలో అలైడ్ హెల్త్ నిపుణులు తీసుకునే జీతం ప్యాకేజీలు వైద్యుల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఆయన తన ప్రసంగంలో వివిధ రకాల కిరణాలు, వాటి వ్యాప్తి స్థాయిల గురించి విద్యార్థులకు వివరించారు. భద్రతా చర్యలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్ ఖాన్, బి, ఒకేషనల్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్, అతిథి ఫ్యాకల్టీ డాక్టర్ ఖాజామొయిన్, డాక్టర్ కుల్సుమ్ జహ్రా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏ దేశానికైనా యువతే ప్రధాన బలం

- 'మనూ' ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్

రాయదుర్గం: ఏ దేశానికైనా యువతే ప్రధాన బలమని ఉర్దూ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్ఈఅండ్‌టి) డీన్ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌ఎంఐ) వేసవి కోర్సులో పాల్గొన్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం యువ శక్తి చాలా గొప్పదన్నారు. మన యువతలో అపారమైన సామర్థ్యం ఉందని, వారు తమ శక్తిని దేశం, సమాజం యొక్క సమగ్రత, అభివృద్ధి, పురోగతి కోసం ఉపయోగించాలన్నారు. జాతీయ ఐక్యతను పెపొందించడానికి దేశం తమ శక్తిని ఉపయోగించాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈ అండ్ టీ హెడ్ ప్రొఫెసర్ మొహద్ మోషాహిద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అథర్‌హుస్సేన్, డాక్టర్ తయ్యబానజ్లీ, డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ ఎహ్తెషాముద్దీన్, డాక్టర్ సబాఖాతూన్ పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల పట్టివేత




సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తదితరులు

- రూ. 6.30 లక్షలు బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- మరో ఏడుగురు అదుపులో.. మిగిలిన వారి కోసం గాలింపు

మాదాపూర్: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి రద్దీగా ఉన్న ప్రదేశాలలో చైన్ స్నాచింగ్‌లతో బాటు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. గురువారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎన్.తిరుపతి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేలు రెండు బృందాలుగా చైన్ స్నాచర్‌లు, పిక్‌పాకెటర్‌ల కోసం నిఘా పెట్టగా గురువారం ఉదయం 8.30 గంటలకు సీఓడి ఎక్స్ రోడ్ బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను గమనించారు. వీరు కాంబ్లే లక్ష్మణ్, వేముల శ్రీనివాస్‌గా గుర్తించారు. వీరిని విచారించగా రద్దీగా ఉండే బస్సులలో బంగారు గొలుసులను అపహరించినట్టు అంగీకరించారు. మరో 7 గురు రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్నట్టు తెలుపడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బస్టాండ్‌లలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్టు అంగీకరించారు. దాదాపు 10 నుండి 15 మంది ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. కాగా మిగిలిన వారు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. తొమ్మిది బంగారు చైన్స్ 93 గ్రాములు, 3 స్మార్ట్ మొబైల్స్, కీపాడ్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 6.30 లక్షలు ఉంటుందన్నారు. మాదాపూర్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకరమఠంలో శ్రీశారదాంబ నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారికి, దేవతా మూర్తి మూలమంత్ర హోమం, మాతృక పూజ, ప్రధాన కలశ స్థాపన, నిత్యపూజ హోమం, సర్వదేవతారాధన, మంత్రపుష్పంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోతీనగర్ శాఖ కార్యనిర్వహణ అధికారి సీఎస్‌ఆర్ మూర్తి, సీఈఓ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వీఆర్ గౌరీశంకర్, శాఖాధిపతి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశారదాంబ పంచలోహ విగ్రహానికి జలాధివాసం చేస్తున్న అర్చకులు భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కుంభాభిషేక మహోత్సవం

దేవాలయాలు ప్రశాంతతకు కేంద్రాలుగా నిలుస్తాయని శివరామంజనేయ దేవాలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా కుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

– మోతీనగర్